

# 'కీ' బొమ్మ

సలీం

తన వెనక ఇసుకలో పాదాల శబ్దం ఆగిపోయినట్లనిపించి ఈరయ్యా వెనుదిరిగి చూశాడు.

సంధ్యారుణకాంతులు చెక్కిళ్ళపై మెరుస్తూ నురగా, ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న కెరటాలూ, వెదజల్లినట్లు మనుషులూ - ఏ డీ పోలిగాడు? ఏమైపోయాడు?

ఈరయ్యా భ్రుకుటి ముడిపడింది. భుజాన ఉన్న వలనీ, చేతిలోని చేపల బుట్టనీ ఓసారి సవరించుకుని కొద్ది దూరం వెనక్కి నడిచి కళ్ళు చిట్లించి చూశాడు.

దూరంగా పిల్లలు ఆడుకుంటున్నారు. వాళ్ళకు కొద్ది దూరంలో నిలబడి ఉన్నాడు పోలిగాడు. సన్నటి బలహీనమైన శరీరం. చేప ఒంటి మీది మెరుపులా నల్లటి శరీరచ్ఛాయలో వింతైన నిగారింపు - బిళ్ళగోచీ. వాడు తదేకంగా ఆ పిల్లల వైపే చూస్తున్నాడు.

"ఒరే పోలిగా... రా రా." ఈరయ్యా పొలికేక సముద్ర ఘోషలో, మనుషుల రణగొణ ధ్వనిలో కలిసిపోయింది. ఆ రోజు ఆదివారం కావడం వల్ల బీచ్ ఒడ్డున చాలా మంది జనం ఉన్నారు. ఇక లాభం లేదనుకుని ఈరయ్యా పోలిగాడి వైపు నడిచాడు.


పోలిగాడు - ఈరయ్యా తన సమీపంలో నిలబడి ఉన్నా గమనించే స్థితిలో లేడు. కళ్ళార్పకుండా ఆడుకుంటున్న పిల్లలవైపే చూస్తున్నాడు. అస్తమించిన సూర్యుడు వాడి కళ్ళలో ఉదయించినట్లు, అవి ఆశతో మెరుస్తున్నాయి.

విసుగుతో, చిరాకుతో కొడుకుని చితగ్గొట్టాలన్నంత కోపంతో వచ్చిన ఈరయ్యా, తన కొడుకు దృష్టిని ఆకర్షించిన వస్తువేదో చూశాక చప్పగా చల్లబడిపోయాడు.

"ఏరా పోలిగా! ఇక్కడే ఆగిపోయావు?" గొంతులో వీలైనంత మార్దవాన్ని నింపుకుని అడిగాడు.

తండ్రి గొంతు విన్న పోలిగాడు ఒక్కసారిగా ఉలిక్కిపడి వెనక్కు తిరిగి చూశాడు - భయం భయంగా. తండ్రి కళ్ళల్లో వాడికి క్రోధపు ఛాయలు కనిపించలేదు. కొద్దిగా ధైర్యాన్ని పుంజుకున్నాడు.

"అయ్యా! నా కదీ కావాలి." పిల్లలు ఆడుకుంటున్న బొమ్మల్లో ఓ బొమ్మ వైపు చేయి చూపించాడు.




అక్కడ ఖరీదైన పిల్లలు - ఖరీదయిన బొమ్మల్తో ఆడుకుంటున్నారు. రకరకాల బొమ్మలు, రంగు రంగుల బొమ్మలు - అందులో కీ బొమ్మ కూడా ఉంది. కీ ఇచ్చి వదిలేస్తే - ఆ ఇసుకలో తన చిన్ని చిన్ని పాదాల్తో, చేతుల్తో తమాషాగా దోగాడుతున్న పసిపిల్లాడి బొమ్మ.

"పద." పోలిగాడి భుజాన్ని పట్టి కొద్దిగా కుదిపి, ముందుకు కదిలాడు ఈరయ్య.

తండ్రి భావన అర్థమైన పోలిగాడు తల వంచుకుని అతని వెనకే నడిచాడు.

మౌనంగా నడుస్తున్న ఈరయ్య మనసునిండా పోలిగాడి కోరికే ఉంది - ముల్లులా గుచ్చుకుంటూ, కీ బొమ్మ కావాలని ఎన్నేళ్ళ నుంచి అడుగుతున్నాడో ఈరయ్యకు సరిగ్గా గుర్తుకు రాలేదు. జ్ఞాపకాల అట్టడుగున పడి మరుగైపోయినంత కాలం నుంచీ అయి ఉంటుంది. ఓ ఏడెనిమి దేళ్ళ నుంచీ - పోలిగాడికి ఐదేళ్ళు వచ్చినప్పటి నుంచీ -

తన కొడుకు - ఒకే ఒక కొడుకు - చిన్న కోరిక తీర్చలేకపోయిన తన అసమర్థత మీద అసహ్యం వేసింది ఈరయ్యకు.

వాడికి ఐదేళ్ళున్నప్పుడు తను సరదాగా పట్నం పిలుచుకెళ్ళాడు. అక్కడ చూశాడు వాడు "కీ" ఇస్తే మెల్లిగా దోగాడే బాబు బొమ్మని. తనకూ వింతగానే ఉంటుంది. ఆ బొమ్మ ప్రాణం ఉన్నట్లే - అలా - మెల్లిగా - ముద్దుగా - దోగాడడం.

వాడి సరదా ఎందుకు కాదనాలని అడిగి చూశాడు. వాడు యాభై రూపాయలు చెప్పాడు. తన గుండె ఆగినంత పనైంది. యాభై రూపాయలే! అమ్మో - తను ఎన్ని రోజులు కష్టపడితే ఆ డబ్బు వస్తుంది? ఎన్ని చేపలు అమ్మితే అంత డబ్బు పోగవుతుంది? ప్రతి రోజూ ప్రాణాలకు తెగించి - సూర్యోదయం కాక ముందే తెప్ప వేసుకుని సముద్రం పైకి వెళ్ళి - సాయంత్రం దాకా కష్టపడినా బుట్టెడు చేపలు దొరకవు. అవి కాంట్రాక్టర్ బాబుకు తప్పనిసరిగా అమ్మాలి. తను ఇప్పటికే ఆ బాబుకి బోల్డు డబ్బు బాకీ ఉన్నాడు - అవసరాలకు అప్పుడప్పుడూ అడిగి తీసుకున్న డబ్బు - దాని మీద అయ్యే వడ్డీ - అందుకే వా డిచ్చిన ఐదో పదో రూపాయల్తో ఇల్లు గడుపుకోవాలి.


తన అసహాయతను కోపంలోకి మార్చుకుని పోలిగాడిని కసురుకున్నాడు. మంకుపట్టుపట్టి ఆ బొమ్మ కోసం ఏడుస్తున్న పోలిగాడికి నాలుగు అంటించాడు.

అప్పటి నుంచీ పోలిగాడు తన ఎదురుగా ఎప్పుడూ ఆ బొమ్మ ప్రస్తావనే తీసుకు రాలేదు. అలాగని వా డా కోరికను చంపుకోనూ లేదు. చిల్లర దొరికినప్పుడల్లా వాడుకొన్న హుండీలో భద్రంగా దాచుకునే వాడు. అవి చిల్లరతో నిండాక - వాటిని పగులగొట్టి - చిల్లరంత తీసుకుని పట్నం వెళ్ళి కీబొమ్మ కొనాలని వాడి పట్టుదల.

ఒకసారి కల్లు కొట్టువాడు తన పాత బాకీ తీరిస్తేగానీ కల్లు పోయనన్నాడు. ఆ రాత్రి పోలిగాడు దాచుకున్న చిల్లర డబ్బులకు రెక్కలొచ్చాయి. బాగా తాగొచ్చిన ఈరయ్య - తిడుతున్న భార్యనీ, ఏడుస్తున్న కొడుకునీ చావబాదాడు. పొద్దున నిషా దిగాక అర్థమైంది తనెంత ఘోరం చేశాడో తన చిన్నారి కొడుకు కీ బొమ్మ కొనడం కోసం దాచుకుంటున్న పైసా పైసా ఒక్క రాత్రిలో తాగేశాడు.

అసహ్యం వేసింది ఈరయ్యకు. "ఛీ... తాగుబోతు వెధవ" తనని తనే తిట్టుకున్నాడు.

ఆలోచనలతో నడుస్తున్న ఈరయ్య మనసంత




ఆర్ద్రమైపోయింది. వెనక్కి తిరిగి కొడుకు వైపు చూశాడు.

వాడు నిరాశ పడినట్లు స్పష్టంగా తెలుస్తూనే ఉంది. దుఃఖాన్ని పళ్ళ బిగువున నొక్కిపెట్టి నడుస్తున్నాడు.

"ఏరా! పోలిగా - ఇంకా బొమ్మలేవిట్రా? నీవింకా చిన్న పిల్లాడివా?"

పోలిగాడు ఏ సమాధానమూ ఇవ్వలేదు. సమాధానం కోసం అర నిముషం ఆగి - మ ళ్లా చెప్పాడు ఈరయ్య.

"నీవు పెద్దవాడి వవుతున్నావు. నా తరువాత ఇంటి భారాన్నంత మోయాల్సింది నీవే."

తన బాధ్యతను గుర్తు చేస్తే కొడుకు సమాధాన పడతా డనుకున్న ఈరయ్య మరోసారి వాడి వైపు చూశాడు. వాడి వాలకం చూస్తేనే అర్థమవుతుంది - వాడెంత బలంగా ఆ కోరికని పెంచుకున్నాడో.

తమ గుడిసె దగ్గర పడుతుండగా అన్నాడు ఈరయ్య. "ఈసారి పట్నం వెళ్ళినప్పుడు కొనిపెడతా లేరా. నీవు దాచుకున్న చిల్లరుందిగా - మరికొంత వేసి నీ కా బొమ్మని కొనిపెడతాను. సరేనా."

ఒక్కసారిగా వరద పొంగినట్టు పోలిగాడిలో ఆనందం పెల్లుబికింది. వాడు ఒక్క ఉదుటున వెళ్ళి ఈరయ్యని కౌగిలించుకుని - పెద్దగా అరుచుకుంటూ వెనక్కి తిరిగి పరుగెత్తాడు - తన స్నేహితుల్తో ఈ విషయం చెప్పటానికి. ఆ రాత్రి వాడి కళ్ళ నిండా - కలల నిండా - కీ బొమ్మలే.

** ** ** **

పోలిగాడు పోలయ్య అయినాడు.

పదిహేడేళ్ళకు బంగారు బొమ్మలాంటి నాగలక్ష్మి మెళ్ళో తాళికట్టి - సంవత్సరం తిరక్కుండానే ఓ బాబుకి తండ్రి అయినాడు.

తనకు బాబు పుట్టినప్పటి నుంచీ పోలయ్యలో నిద్రాణమైన కోరిక మరలా మేల్కొంది.

తన కా అదృష్టం లేకున్నా - తన కొడుకు అడక్కుండానే వాడికి కీ బొమ్మ కొనివ్వాలన్న కోరిక. వాడు ఆ బొమ్మ చుట్టూ తన చిన్ని చేతుల్తో చప్పట్లు కొడుతూ ఆడుకుంటుంటే - వాడితో పాటు తనూ సంబరపడిపోవాలన్న కోరిక.

"ఈసారి పట్నం వెళ్ళినప్పుడు కొనిపెడ్తానన్న" ఈరయ్య ఆ రోజు రాక ముందే కడలి ఒడిలో కలిసిపోయాడు. ఆ రోజు పోలయ్యకు బాగా గుర్తుంది.

"అమ్మకు జొరంగా ఉంది. నీవు అమ్మ దగ్గరే జాగర్తగా ఉండు. నేను తొరగా వచ్చేస్తాలే" అని చెప్పి వెళ్ళిన అయ్య ఎప్పటికీ తిరిగి రాలేదు.

ఈరయ్య సముద్రం పైకి వెళ్ళిన గంటకే ఆకాశం దట్టంగా మేఘాల్తో నిండిపోయింది. విపరీతమైన వేగంతో గాలి వీచింది. అమ్మా, తనూ ఒకరిని ఒకరు కౌగిలించుకుని బావురుమన్నారు. ఆ రోజు ప్రారంభమైన వర్షం వరుసగా మూడు రోజులు ధారాపాతంగా కురుస్తూనే ఉంది. ఎవరో వచ్చి తనను, అమ్మను, మిగతా గూడెం వాళ్ళను సురక్షితమైన ప్రదేశానికి పిలుచుకెళ్ళారు.

ఆ రోజు అమ్మ అ నారోగ్యంగా లేకపోతే

అయ్యతో పాటు తనూ సముద్రం పైకి వెళ్ళి ఉండేవాడు. అప్పుడు అమ్మ ఒంటరిదైపోయి ఉండేది.

ఈ ఆలోచన వచ్చినప్పుడల్లా పోలయ్య భయంతో వణికిపోతుంటాడు.

వర్షం అంత తగ్గాక - ఎంత గాలించినా తన అయ్య జాడ తెలియలేదు. అమ్మ దిగులుతో, అనారోగ్యంతో మంచం పట్టింది. ఇల్లు గడవడం కోసం, తను కీ బొమ్మ కొనాలని దాచుకున్న డబ్బంతా ఖర్చయిపోయింది. ఆ తరువాత ప్రారంభమైంది అసలైన జీవన పోరాటం. పోలయ్య ఎన్నో చేదు అనుభవాల్ని తన రక్తంలో జీర్ణించుకున్నారు. మధ్య దళారీల స్వార్థం, మనుమల సంకుచితమైన మనస్తత్వాలూ, జీవితంలోని అవసరాలూ, రోగాలూ రొష్టులూ - చాలీ చాలని డబ్బు - ఆకలీ - నిస్సహాయత - అన్నీ అన్నీ జీర్ణించుకున్నాడు.

ఈ అనంతమైన, నికృష్టమైన పోరాటంలో - మనస్తాపంలో - తల్లి మందుల ఖర్చు, పట్టెడన్నం కోసం పడే ఆరాటం తప్ప తన కోరిక గుర్తుకే రాలేదు. మౌలికమైన అవసరాలు ఎంత బలమైనవో - ఆకలీ - అనారోగ్యాలూ మనిషిని ఎంతటి దీన స్థితికి దిగజార్చుతాయో అర్థమయాక తన అతి చిన్న కోరిక వాటి ముందు అతి తుచ్ఛమైన దనిపించింది.

ఆ తరువాత నాగలక్ష్మితో పెళ్ళి...

లచ్చి కళ్ళు బొమ్మ కళ్ళలా ఎంత అందంగా ఉంటాయో - తనలో తను మురిసిపోతూ నాగలక్ష్మి అందం గురించి పదే పదే వర్ణించుకుని ఆనందపడిపోతూ మరో సంవత్సరం కీ బొమ్మ గురించి మరిచిపోయాడు.

పోలయ్యకు కొడుకు పుట్టాడు. వాడు అచ్చం ఈరయ్య పోలికే. అందుకే వాడికి తన అయ్య పేరే పెట్టుకున్నాడు. వాడిని చూస్తున్న ప్రతిసారీ, వాడితో ఆడుకుంటున్న ప్రతిసారీ పోలయ్యకు "కీ" బొమ్మ గుర్తుకు రాసాగింది.

తన అయ్య తనకు "కీ" బొమ్మ కొనిస్తానని, ఆ రెండో రోజే గంగమ్మ తల్లికి ప్రియమైపోయాడు. ఇప్పుడు తను తన అయ్యకు "కీ" బొమ్మ కొనిచ్చి ఆ సంతోషాన్ని, ఆనందాన్ని పంచుకుంటాడు. ఈ ఊహే పోలయ్యలో నూతనోత్సాహాన్ని నింపేది.

కానీ తన అయ్య చేసిపోయిన అప్పు తీర్చడంలో తన కొడుకూ తనలా జీవితంలోని చేదుని అనుభవించకూడదన్న దృఢ సంకల్పంతో చాలా భాగం జీవితం హరించుకుపోయింది.

తన కొడుకు పదేళ్ళ వాడయినప్పుడు వాడికి బహుమతిగా "కీ" బొమ్మ ఇద్దామనుకున్నాడు. ఆ రోజు చాలా ఉత్సాహంగా కొడుకుని పిలుచుకుని పట్నం వెళ్ళాడు.

తన అయ్య తన కోసం కొనాలనుకున్న బొమ్మని వెతుక్కుంటూ బయల్దేరాడు. పట్నం చాలా మారిపోయింది - గుర్తుపట్టనంతగా. ఒక పెద్ద బొమ్మల దుకాణంలోకి వెళ్ళి "కీ" బొమ్మ కావాలని అడిగాడు.

"కీ" ఇస్తే నడిచే బొమ్మ "కీ" బొమ్మ కావాలని అడిగాడు.

"కీ" ఇస్తే నడిచే బొమ్మ, "కీ" ఇస్తే తాళం వేసే బొమ్మ, "కీ" ఇస్తే ఢంకా మోగించే బొమ్మ... ఎన్ని రకాల బొమ్మలో... "కీ" ఇస్తే దేగాడే బొమ్మను చేతుల్లోకి తీసుకున్నాడు - ఓ మధురమైన అనుభూతి నరనరాల్లోకి పాకింది. దాన్ని అపురూపంగా, అతి సుతారంగా చేత్తో నిమిరాడు. కీ ఇచ్చి వదిలేస్తే - అది ముద్దుగా దేగాడుతుంటే చిన్న పిల్లాడిలా చప్పట్లు కొట్టాడు. బొడ్లో దోపుకున్న మాసిపోయిన నోట్లన్నీ తీసి బల్ల మీద వేశాడు. వాటిని భద్రంగా ఒకటొకటిగా పేర్చి లెక్క పెట్టాడు. యాభై రూపాయలు... ఎంత కష్టపడి దాచి పెట్టిన డబ్బు! తన భార్య, తల్లీ, తన కొడుకూ - వీళ్ళ అవసరాలకు అఘాతం కలక్కుండా కేవలం తన అవసరాలు మానుకుని - కడుపు కట్టుకుని - రక్తం నోట్ల క్రింద మార్చి జమ చేసిన డబ్బది.

వాటిని జాగ్రత్తగా షాపువాడికి ఇవ్వబోయాడు.

"ఎంత?" అవి తాకకుండానే, ఆ నలిగిన నోట్ల వైపు - మురికి బడుతున్న పోలయ్య చేయి వైపు అసహ్యంగా చూసి అడుగుతున్న వ్యక్తిని భయం భయంగా చూస్తూ చెప్పాడు పోలయ్య. "యాభై రూపాయలు బాబూ!"

పురుగుని చూసినట్లు చూస్తున్న అతని చూపునీ, పాములా మెలివేస్తున్న అనుమానాన్నీ పక్కకు నెట్టి ఆశగా చూశాడు పోలయ్య.

"ఫో... ఫో... వంద రూపాయలకు పైసా తక్కువైనా రాదు పో" కసురుకున్నా డతను.

హతాశుడైపోయాడు పోలయ్య.

"మా అయ్యతో వచ్చినప్పుడు యాభయ్యేగా!" ఏదో ఆశ తళుక్కుమనగా చెప్పాడు పోలయ్య.

"నీ మనవడితో వచ్చినప్పుడు కూడా యాభయ్యే ఉంటుందా? పో పోరా!" ఎగతాళిగా నవ్వుకుంటూ పోలయ్యని బైటికి పంపించాడు.

"అయ్యా - మీ కాల్మొక్కుతా... నా మీద దయ చూపండి... ఆ బొమ్మ నా ప్రాణం... జీవితాంతం మీకు వూడిగం చేస్తాను. ఆ బొమ్మ ఇచ్చేయండి బాబయ్యా!" అంటూ పోలయ్య విలవిల్లాడిపోయాడు... ఆ షాపులో ఉన్న ప్రతి వ్యక్తినీ కాళ్ళు పట్టుకుని బ్రతిమాలుకున్నాడు.

ఏ గుండె కరగలేదు. ఏ మనసూ ద్రవించలేదు.

పోలయ్య కన్నీళ్ళు తప్ప ఏ వ్యక్తీ అతన్ని ఓదార్చలేదు.

ఇది జరిగాక - "ఎట్లాగయినా వంద జమ చేసి ఆ బొమ్మను నా అయ్యకు కొనిస్తాను" అని అతి దృఢంగా, బలంగా నిర్ణయించుకున్న పోలయ్య - ఆ తరువాత ఆ పని చేయలేకపోయాడు.

వందకు ఇంకో పది రూపాయలు తక్కువగా ఉన్నప్పుడు పోలయ్య తల్లి చనిపోయింది. తన అయ్య భద్రంగా కాపాడమని తన చేతుల్లో పెట్టి పోయిన తల్లి, తుపాను రోజు తనని గట్టిగా పట్టుకుని ఏడ్చేసిన తన తల్లి - ఆ రోజు తను చావకుండా బ్రతికింది తన తల్లి సేవకే అని తను నమ్మి పూజించి, ప్రేమించిన తల్లి.


ఏ లోటూ రాకుండా అన్ని కర్మకాండలూ ముగిసేటప్పటికే దాచి పెట్టుకున్న డబ్బుతో పాటు మరికొంత అప్పు కూడా అయింది.

తన తల్లి జ్ఞాపకాలు కొన్నాళ్ళు పోలయ్యని వేదాంతిలా మార్చాయి. ఏ కోరికా, ఏ ఆశా లేకుండా నిర్వికారంగా, యాంత్రికంగా కొన్నాళ్ళు బ్రతుకీడ్చాడు. అప్పటికి ఈరిగాడికి పదిహేనేళ్ళొచ్చాయి.

ఈ పరిస్థితుల నుంచి బైట పడ్డాక తీరని తన కోరిక తీర్చుకోవాలన్న తపన పెరిగింది. "కీ" బొమ్మని తెచ్చుకుని - తన ఇంట్లో అది ముద్దు ముద్దుగా నడుస్తుంటే చూస్తూ గడపాలనీ, సాయంత్రాలు - నీరెండ నీళ్ళ మీద పడి మెరుస్తున్నప్పుడు ఇసుకలో కూర్చుని ఆ బొమ్మతో - ఈరిగాడితో ఆడుకోవాలని - బలమైన కోరిక.

మరలా డబ్బు దాచడం ప్రారంభించాడు పోలయ్య.

"నీకేమైనా పిచ్చా - ఈ వయసులో ఆ కోరికేమిటి? నాకేం అవసరం లేదు. నీ మనవడు పుట్టినప్పుడు కొనొచ్చులే. అప్పటి వరకూ గమ్మున కూచో" అని తన కొడుకు తనని తిట్టే వరకూ పోలయ్యకు తెలియడం లేదు - తనకీ, తన కొడుక్కీ మధ్య ఎంతటి అంతరం ఉందో. తన అయ్య పేరెట్టిన తన ముద్దుల ఈరిగాడికీ, తన అయ్యకూ ఎక్కడ పోలిక ఉందో - పదహారేళ్ళు



నిండని ఈరిగాడు కల్లు పాకకు బానిసై పోయాడు. తను అపురూపంగా దాచుకున్న డబ్బూ, తన తీరని కోరికా ఈరిగాడి కల్లు ముంతలో కరిగిపోయాయి.

** ** ** **

ఈరయ్యకు పెళ్ళయింది. కానీ మనవడు పుడితే "కీ" బొమ్మ కొనాలన్న కోరిక పోలయ్యకు తీరలేదు. ఈరయ్యకు పిల్లలే పుట్టలేదు.

పోలయ్యలో వృద్ధాప్యంతో పాటు పసితనపు కోరికా పెరిగింది. "కీ" బొమ్మతో ఆడుకోవాలన్న కోరిక. సముద్రపు ఒడ్డున - మిగతా పిల్లల్లాగే, బొమ్మకు కీ ఇచ్చి - అది దోగాడుతుంటే కేరింతలు కొడుతూ ఆడుకోవాలన్న కోరిక. తన వయసుతో పాటు పెరిగిన కోరిక - తన రక్తంలో ఇంకిపోయిన కోరిక.

"ఈ ముసలాడికి ఇదేం బుద్ధి" అని కోడలు రాగాలు తీసినప్పుడల్లా - "ఏరా ముసలోడా - పెట్టింది తిని ఓ మూలన పడి ఉండక ఆట బొమ్మలు కావాలా - పిచ్చోడివని పది మంది రాళ్ళతో కొడ్తార్రా" అని కళ్ళెర్ర చేసి దుర్భాషలాడే తాగుబోతు కొడుకు.

"వీడికి చేయలేక నా చేతులు పడిపోతున్నాయి" అని కసురుకునే కోడలు.

పోలయ్య ఇవేమీ పట్టించుకోవడం లేదు.

"లచ్చీ! నీవు నన్ను వదిలి వెళ్ళిపోయినా ఈ "కీ" బొమ్మ నాకు తోడుగా ఉంది చూశావా" అని తన లచ్చితో చెప్పుకోవాలని పోలయ్య ఆరాటం. లచ్చి చనిపోయాక పోలయ్య మరీ ఒంటరివాడైపోయాడు. అతనికి తోడు అతని కోరికే - అతని ధ్యాస, ధ్యానం అన్నీ ఆ "కీ" బొమ్మ చుట్టూ పరిభ్రమిస్తూ ...

ఇప్పుడు పోలయ్యకు కలలు కనటం తప్ప వాస్తవంలో ఆ కోరిక తీరే అవకాశమే లేదని అర్థమైపోయింది.

పెళ్ళాం ఏం చెప్పినా నమ్మే తన కొడుకు, కల్లుకే కాకుండా తన కోడలికి కూడా బానిసైన తన కొడుకు - తన కోరిక ఎన్నటికీ తీర్చడు. ఈ విషాదం విషంలా పోలయ్యను కొద్ది కొద్దిగా హరించివేయటం ప్రారంభించింది. తన కోరిక తీరకుండానే చచ్చిపోతానేమో నన్న దిగులు పోలయ్యను మృత్యువుకు మరింత చేరువగా నెడ్తోంది.

కలలో - 'కీ'బొమ్మతో ఆడుకుంటున్న పోలయ్య ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు. తన కొడుకు, తన ఈరిగాడు తనని కాళ్ళతో తంతున్నాడు.

"ఏరా ముసలోడా! గంజి తాగ నన్నావట - దాన్ని ఏదేదో అన్నావట."

తన కొడుకు బాగా తాగి వచ్చినట్లున్నాడు - తూలుతున్నాడు.

కోడలి గొంతు తారస్థాయిలో వినిపిస్తోంది.

"ఈ ఇంట్లో ఆడైనా ఉండాల, నేనైనా ఉండాల."

పోలయ్య గొంతు పొడారిపోయింది.

"నిన్ను తేరగా మేపేది చాలక, నీచేత మాటలు కూడా పడాలా - పీళ్ళు కొవ్వెక్కిందిరా నీకు." ఈరయ్య పైపైకి వస్తున్నాడు కొట్టడానికి.

"నేను కావాలో, ఆడు కావాలో తేల్చుకో." తన కోడలు సవాలు విసిరింది.

తక్షణం జవాబు వచ్చింది.

"పోరా - ఇంట్లోంచి బయటికి పో."

తనని తన కొడుకు బయటికి ఈడ్చేసి తలు పేసుకున్నాడు.

పోలయ్య కళ్ళలో నీళ్ళు - పోలయ్య తన గుడిసెవైపోసారి చూశాడు. తను కష్టపడి కట్టుకున్న గుడిసె - 'కీ'బొమ్మతో ఆడుకోవా లనుకున్నది ఈ గుడిసెలోనే. తను తన ఈరిగాడిని వీపుమీద ఎక్కించుకుని ఆడించుకున్నది ఇక్కడే.

పోలయ్య బలహీనమైన శరీరం చలికి వణికింది. గోచీ తప్ప మ రే ఆచ్ఛాదనా లేని ఎముకల గూడులాంటి శరీరం, కోరికల్ని భద్రంగా కాపాడుకుంటూ వస్తున్న శరీరం, ఆశల్ని మోసుకుంటూ వచ్చిన శరీరం.

పోలయ్య సముద్రంవైపు నడిచాడు. తన తల్లి ఒడిలాంటి సముద్రం, తన తండ్రి ఆప్యాయతను గుర్తుకు తెచ్చే సముద్రం.

సముద్రానికి అతి సమీపంగా - ఉవ్వెత్తున లేచే కెరటాలకు దగ్గరగా - ఆ ఇసుకలో పడుకున్నాడు. తలక్రింద చేతులు ఉంచుకుని వెల్లకిలా పడుకుని ఆకాశం కేసి చూశాడు. అంతా అంధకారం - ఒక్క నక్షత్రమూ కనిపించటంలేదు. రాకాసిలా ఎగసిపడే కెరటం - దాని కిరీటం లాంటి నురగా తప్ప మరేమీ కనిపించటం లేదు. ఎముకలు కొరికే చలీ, ఆకలీ.

పోలయ్య కళ్ళు మూసుకున్నాడు.

ఈ ప్రదేశంలోనే - ఆ పిల్లలు 'కీ'బొమ్మల్తో ఆడుకున్నది. ఈ ప్రదేశంలోనే తనూ 'కీ'బొమ్మతో ఆడుకోవా లనుకున్నది. తన వీపు కింద నలుగుతున్న ఈ ఇసుకలోనే తను గెంతుతూ, తుళ్ళుతూ, కేరింతలు కొడుతూ కాలం గడపా లనుకున్నది.

ఆకలీ, నీరసంవల్ల పోలయ్యకు మగతగా నిద్ర పుట్టింది.

తను తన ఇంట్లో ఆడుకుంటున్నాడు. తన దగ్గర 'కీ'బొమ్మ - చాలా అందమైన 'కీ'బొమ్మ - తను 'కీ' ఇచ్చి వదిలాడు. అది తన బుల్లి బుల్లి పాదాల్తో, బుల్లి బుల్లి చేతుల్తో దోగాడుకుంటూ వస్తోంది. ఎంత ముద్దొస్తుందో - ఎత్తుకుని ముద్దు పెట్టుకున్నాడు. ఆ బొమ్మ అచ్చం తన ఈరిగాడిలానే ఉంది. అది ముద్దుగా నడుచుకుంటూ అడుగులో అడు గేసుకుంటూ తన దగ్గరకు వస్తోంది.

హఠాత్తుగా పోలయ్య చేతిలోంచి 'కీ'బొమ్మని మ రెవరో లాక్కున్నారు. 'కీ' ఇచ్చి ఆ ఇంట్లోనే వదిలారు. అది చేతులు ఊపుతోంది. బెదిరిస్తోంది. బూతులు తిడుతోంది. మరలా 'కీ' ఇచ్చారు. అది తనని కాళ్ళతో తంతోంది. పోలయ్య ఏడుస్తున్నాడు. 'కీ' తన చేతి కిమ్మని మారాం చేస్తున్నాడు. 'కీ' లాక్కున్న వ్యక్తి ఓ స్త్రీలా ఉంది. మరలా బొమ్మకు 'కీ' ఇచ్చింది. అది భయంకరంగా తనవైపుకు దూసుకువచ్చి, తనని ఇంట్లోంచి బయటికి విసిరేసింది.

ఒక్కసారిగా లేచి కూచున్నాడు పోలయ్య. అంత చలిలోనూ ఒళ్ళంతా చెమటతో తడిసిపోయింది. కలను గుర్తుకు తెచ్చుకున్నాడు. ఆ 'కీ' బొమ్మ తన కొడుకు ఈరయ్యలా ఉంది. ఆ స్త్రీ తన కోడలిలా ఉంది.

ఆ క్షణంలోనే పోలయ్యకు జ్ఞానోదయమైంది. తను గమనించకుండానే త నింట్లో ఓ 'కీ' బొమ్మ కదులాడుతోంది. తన ఇన్నాళ్ళ కోరిక తీరకుండానే చనిపోతానేమో నన్న దిగులు ఒక్కసారిగా మాయమైంది. తన కోరిక ఏనాడో తీరింది.

పోలయ్యలో ఎక్కడలేని ఉత్సాహమూ, ఉత్తేజమూ వచ్చేశాయి. ఉన్మాదం వచ్చిన వ్యక్తిలా లేచి గెంతులు వేయటం ప్రారంభించాడు. పసిపిల్లాడిలా చప్పట్లు కొడుతూ - ఆ ఇసుకలో పరుగెత్తుతున్నాడు.

ఆకాశం దట్టంగా మేఘావృతమైన విషయం కానీ, సముద్రంలో చెలరేగుతున్న అలజడిని కానీ, రాబోతున్న తుపాను ఛాయల్ని గానీ గమనించే స్థితిలో లేడు. ★

